ప్రజాశక్తి

మంగళవారం 5 సెప్టెంబర్ 2023 5

శ్రీ సత్యసాయి

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నేడు 'అనంత'కు చంద్రబాబు



◆ మూడు రోజుల పాటు పర్యటన

◆ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో హాజరు

◆ మూడు నియోజకవర్గాల సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం నుంచి మూడు రోజులపాటు అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. 'భవిష్యత్‌కు బాబు గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొంటారు. అదే సమయంలో నియోజకవర్గాల సమీక్షలు కూడా ఉండనున్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం బళ్లారికి విమానంలో చేరకుంటారు. బళ్లారి నగరంలో కమ్మమహాజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. తరువాత కర్నాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని ఓబుళాపురం చెక్‌పోస్టు వద్దకు చేరుకుంటారు. వేదవతి మీదుగా పల్లేపల్లి మీదుగా రాయదుర్గం చేరుకుంటారు. సాయంత్రం ఆరు గంటలకు తేరు సెంటర్‌లో బహిరంగ సభలో పాల్గొంటారు. రెండో రోజు బుధవారం ఉదయం 10 గంటలకు యాత్ర ప్రారంభమవుతుంది. కణేకల్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి ఉరవకొండలోని కౌకుంట్ల గ్రామంలో జరిగే ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కుమారుడి వివాహ రిసెప్షన్‌లో పాల్గొంటారు. అనంతరం ఒంటిమిద్ది మీదుగా కళ్యాణదుర్గం నియోజకవర్గం చేరుకుంటారు. సాయంత్రం 4.15 గంటలకు టి.సర్కిల్‌లో రోడ్డు షోలో పాల్గొంటారు. వాల్మీకి సర్కిల్ నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. మూడవ రోజు పర్యటన కళ్యాణదుర్గంలో ప్రారంభమవుతుంది. మహిళా ప్రగతి కోసం వేదిక అన్న అంశంపై చర్చ ఉండనుంది. మధ్యాహ్న భోజన విరామం తరువాత పామిడిలో వస్త్ర కార్మికులతో మాట్లాడుతారు. గుత్తి సర్కిల్ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అక్కడితో చంద్రబాబు మూడు రోజుల పర్యటన ముగియనుంది. అనంతపురం నుంచి కర్నూలు జిల్లాలోకి ప్రవేశిస్తారు.

నియోజకవర్గాల సమీక్షల్లో దిశానిర్దేశం

భవిష్యత్‌కు గ్యారెంటీ యాత్ర సందర్భంగా మూడు నియోజకవర్గాల్లో బాబు పర్యటన సాగనుంది. ఈ సందర్భంగా నియోజకవర్గాల సమీక్షలు సైతం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ సమీక్షలతోనైన టిడిపి నేతలు ఏకతాటిపైకి వస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది. ప్రధానంగా అందరి దృష్టి కళ్యాణదుర్గం నియోజకవర్గంపై ఉంది. 2019 ఎన్నికలకు ముందు నుంచి ఇక్కడ గ్రూపు తగాదాలు నడుస్తున్నాయి. నియోజకవర్గంలో ఇప్పటికీ గ్రూపు తగాదాలు నడుస్తూనే ఉన్నాయి. బాబు పర్యటన జరుగుతున్న ఈ సమయంలోనూ ఆ పార్టీ నేతలు విడివిడిగానే సమావేశాలు జరుపుతున్నారు. దీంతో అప్రమత్తమైన జిల్లా నేతలు ఇరు వర్గాలకు సర్దిజెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇవి ఏ మేరకు కొలిక్కొ వస్తాయన్నది చూడాల్సి ఉంది. గతంలో యువగళం పాదయాత్ర సందర్భంలోనూ నేతల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్న సందర్భాలూ ఉన్నాయి. ఈసారి అటువంటి తలెత్తకుండా ఉండే విధంగా జిల్లా నేతలు ప్రయత్నిస్తున్నారు. ఇక గుంతకల్లు నియోజకవర్గంలోనూ నేతల మధ్య సఖ్యతలేదు. పార్టీ కార్యక్రమాలు ఇక్కడ అంతంత మాత్రంగానే నడుస్తున్నాయి. మూడు నియోజకవర్గాల సమీక్షల్లో ఏ రకమైన మార్గనిర్దేశం ఇస్తారోనన్నది కూడా ఆసక్తికరంగా మారింది.

అర్జీలకు మెరుగైన పరిష్కారం

కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్పందనలో అందే ప్రతి అర్జీకి మెరుగైన పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులు ఆదేశించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్ఓ కొండయ్య, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గ్రామ వార్డు సచివాలయ నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖతో కలిసి అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వర్చువల్ విధానం ద్వారా అధికారులతో మాట్లాడుతూ రీ ఓపెన్ పిటీషన్‌లు నాలుగు ఉన్నాయని, రీ ఓపెన్ పిటీషన్లు రాకుండా నాణ్యతగా పిటీషన్లను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. రీ ఓపెన్ పిటీషన్‌లను సీరియస్‌గా తీసుకుని పరిష్కరించాలన్నారు. రీఓపెన్ పిటీషన్లను జిల్లా అధికారులు నిత్యం ఓపెన్ చేసి చూసుకోవాలన్నారు. అర్జీదారుడితో మాట్లాడాలని, అర్థమయ్యేలా అతనికి వివరించాలన్నారు. క్షేత్రస్థాయిలో తహశీల్దార్, ఆర్డీవోలు అర్జీలకు నాణ్యతగా పరిష్కారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, పిఆర్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్డీఏ పీడీ నరసయ్య, డిఎంహెచ్ఓ డా॥కృష్ణారెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

8న మెగా జాబ్‌మేళా

జాబ్‌మేళా పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఈ నెల 8వ తేదీన ధర్మవరంలో స్కిల్ డెవలెప్మెంట్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్కిల్ డెవలప్మెంట్, ట్రైనింగ్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన ధర్మవరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించే జాబ్ మేళా పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం ప్రతి నెలా 2వ శుక్రవారం స్కిల్ డెవలెప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ నెల 8వ తేదీన శుక్రవారం ధర్మవరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటలకు నిర్వహించే జాబ్ మేళాలో 13 రకాల కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా, బీటెక్ చదివిన విద్యార్థులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ మాట్లాడుతూ ధర్మవరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించే జాబ్ మేళాలో నిరుద్యోగులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్ఓ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, డిఎల్‌డిఓ శివ రెడ్డి, సిపిఓ విజయ్ కుమార్, ఎల్‌డిఎం రమణ కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

పురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందిస్తామని ఛైర్‌పర్సన్ ఇంద్రజ తెలిపారు. పట్టణంలోని 19వ వార్డు సచివాలయంలో సోమవారం ఆమె నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంద్రజ మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన మాట మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అర్హులెవరూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి, అర్హత ఉంటే మీ ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆమె పట్టణ ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి ఎంత మంది రోగులు వస్తుంటారు, పరీక్షలు ఏమి చేస్తారు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు.

నూతన పింఛన్లను లబ్ధిదారులకు అందిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ

ఓటరు జాబితా పున:పరిశీలన ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పక్కాగా ఓటరు జాబితా పున:పరిశీలన

ప్రజాశక్తి-పెనుకొండ

తొలగించిన ఓటర్ల జాబితా పున్ణపరిశీలన ప్రక్రియను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులకు సూచించారు. ఈ ఏడాది తొలగించిన ఓటర్ల జాబితా పున:పరిశీలనలో భాగంగా సోమవారం కలెక్టర్ మండల పరిధిలోని వెంకటరెడ్డిపల్లి, కొండంపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సుగాలి అనితబాయి, చౌలిబాయి ఇళ్లకు వెళ్లి బిఎల్ఓ లు మీ ఇంటిని సందర్శించారా లేదా నూతన ఓటర్లను గుర్తించారా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ, స్పెషల్ ఆఫీసర్ పద్మమ్మ, తహశీల్దార్ స్వర్ణలత, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ హనుమంతు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ గణేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా రమేష్‌బాబు

ప్రజాశక్తి-హిందూపురం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రమేష్‌బాబు నాయక్‌ను జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం రమేష్‌బాబు నాయక్ మాట్లాడుతూ తాను చిలమత్తూరు మండలం దేమకేతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నానన్నారు. ఐదేళ్లుగా తాను బోధించే సబ్జెక్టులో వంద శాతం ఫలితాలు వచ్చాన్నారు. దీంతో పాటు పాఠశాల అభివృద్ధికి, గ్రామంలో చేసిన సామాజిక పనులను గుర్తించి తనను ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారన్నారు.

సికె పల్లి వైస్ ఎంపిపిగా జ్యోతి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మండల వైస్ ఎంపిపిగా గాలి శ్రీనివాసరెడ్డి భార్య జ్యోతి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి రాప్తాడు నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరి ఇంటికి చేరేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, మండల కన్వీనర్, జడ్పిటిసి, ఎంపిపి, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, డైరెక్టర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

తూకంలో మోసం చేస్తే కఠిన చర్యలు

లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్

ప్రజాశక్తి-హిందూపురం

తుకాల్లో మోసం చేస్తే కఠిన ర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్ హెచ్చరించారు. ఆయన సోమవారం పట్టణంలోని పలు రేషన్ దుకాణాలు, షాపులను సిబ్బందితో కలిసి తనఖీ చేశారు. రెండు చౌకదుకాణ నిర్వాహకులు తూకంలో తక్కువ ఇవ్వడంతో వారిపై కేసు నమోదు చేశారు. అలాగే పలు దుకాణాలను సందర్శించి వస్తువు తయారు చేసిన సంవత్సరం, గరిష్ట అమ్మకం ధర, కన్స్యూమర్ కేర్, తదితర వివరాలు ముద్రించక పోవడంతో రెండు షాపులపై కేసులు నమోదు చేశారు.

చౌకదుకాణంలో తుకాలను పరిశీలిస్తున్న అధికారి

అనంతరం ఆయన మాట్లాడుతూ చౌకదుకాణాలతో పాటు అన్ని వ్యాపార దుకాణాల నిర్వాహకులు, దుస్తుల వ్యాపారులందరూ నిబంధనల మేరకు వ్యాపారాలు చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా కేసులు నమోదు చేసి చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమనేతకు తుదివీడ్కోలు

పోలా రామాంజినేయులు అంతిమయాత్రలో పాల్గొన్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

ధర్మవరంలో పోలా రామాంజినేయులు అంత్యక్రియలు

తరలివచ్చిన వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

నివాళులు అర్పించిన చేనేత కార్మికులు

'జోహార్ పోలా రామాంజినేయులు' అంటూ నినాదాలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

చేనేత ఉద్యమ నేతకు తుదివీడ్కోలు పలికారు. అనారోగ్య సమస్యలతో ఆదివారం నాడు తుదిశ్వాస విడిచిన ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సిపిఎం సీనియర్ నాయకుడు పోలా రామాంజినేయులు అంత్యక్రియలను ధర్మవరంలో సోమవారం నిర్వహించారు. చేనేత కార్మిక సమస్యలపై అలుపెరగని పోరాటం సాగించిన ఆయన్ను తుదిసారి చూసేందుకు పెద్ద సంఖ్యలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు తరలొచ్చారు. ఎర్రజెండాను ఆయన భౌతికకాయంపై ఉంచి నేతలు నివాళులు అర్పించారు. రామాంజినేయులు స్వగృహం నుంచి ప్రారంభం అయిన అంతిమయాత్ర బత్తలపల్లి రోడ్డులోని శ్మశానవాటిక వరకు కొనసాగింది. 'జోహార్ పోలా రామాంజి నేయులు.. జోహార్.. జోహార్" అంటూ అంతిమ యాత్రలో నాయకులు, కార్మికులు నినదించారు.

పోలా రామాంజినేయులు భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ధర్మవరంలోని ఆయన నివాసం వద్ద ఉంచారు. ఉదయం 9 గంటలకు ఆయన ఇంటి నుంచి అంతిమ యాత్రను ప్రారంభించారు. సిపిఎం, సిపిఐతో పాటు వివిధ పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి పోలా రామంజినేయులు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, సీపీఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు, శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, జిల్లా నాయకురాలు దిల్షాద్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్దన్న, సుబ్బిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, నాయకులు జింకాచలపతితో పాటు పలువురు నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్రనాయకులు జి.ఓబులు, జిల్లా కార్యదర్శి ఇంతియాజ్‌లు పోలా రామాంజినేయులు పాడెమోశారు. చేనేత కార్మికులు, ప్రజల నడుమ దిమ్మెల సెంటర్, తేరుబజార్, అంజుమాన్ సర్కిల్, కాలేజ్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, గాంధీనగర్ సర్కిల్, పట్టణ పురవీధుల్లో అంతిమ యాత్రను నిర్వహించారు. బత్తలపల్లి రోడ్డులోని శ్మశాన వాటికలో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలను నిర్వహించారు. అంతిమ యాత్ర మొదలు నుంచి చివర వరకు పోలా రామాంజినేయులు జోహార్లు పలికారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దన్న, బడా సుబ్బిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, ఆదినారాయణ, సిఐటియు అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, సిపిఎం పట్టణ కార్యదర్శి నామాల నాగార్జున, సిపిఎం నాయకులు ఎస్‌హెచ్.బాషా, కదిరి నాయకులు నరసింహులు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాబ్జాన్, సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి మధు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జెవి రమణ తదితరులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

ధర్మవరంలో సాగుతున్న పోలా రామాంజినేయులు అంతిమయాత్ర

దీర్ఘకాలిక రోగులకు ప్రత్యేక సేవలు

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ రోహిల్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

ఎంప్లాయిస్ హెల్త్ కార్డు కలిగి ఉండి దీర్ఘకాలిక రోగాలతో బాధ పడుతున్న ఉద్యోగులు, పెన్షనర్లకు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్ తెలిపారు. ఈ వైద్య సేవలను జిల్లా ఆసుపత్రిలో సోమవారం సూపరింటెండెంట్, ఆర్ఎంఒ రుక్మిణమ్మ ప్రారంభించారు. అనంతరం మాతాశిశు విభాగంలోని సెమినార్ హాలులో ఉద్యోగులు, పెన్షనర్లతో ఆరోగ్యశ్రీ జిల్లా అధికారి శివకుమార్ అధ్యక్షత న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఆరోగ్యశ్రీ సేవల్లో భాగంగా ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక వైద్య సేవలు అందిస్తామన్నారు. 40 ఏళ్లు పైబడిన వారందరికీ 25 రకాల దీర్ఘకాల వ్యాధులకు ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తామని, ఈ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు చక్రధర్, సునీల్, డేవిడ్ రాజు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన తమకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరుతూ బూదిలి గ్రామానికి చెందిన రోడ్డు నిర్వాసిత బాధితులు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో జరిగిన స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ రంగనాయకులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో నిరుపేద దళితులకు సర్వే నెంబర్-154-2లో అప్పట్లో ప్రభుత్వం పట్టాలు ఇవ్వడంతో పాటు పక్కా గృహాలు మంజూరు చేయగా అప్పటి నుంచి 40 కుటుంబాలకు పైగా జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే పుట్టపర్తి నుంచి కోడూరు హైవేను కలిపే క్రమంలో రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లను కోల్పోయి రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం సెంటుకు కేవలం రూ. 16,500 పరిహారం ఇస్తుందని, ప్రస్తుతం ఈ ప్రాంతంలో సెంటు ధర రూ. 4 లక్షలు పలుకుతోందని, కూలి పనులు చేసుకుంటున్న తమకు ఇళ్ల స్థలాలు కొనే స్తోమత లేదని ప్రభుత్వమే ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని, నష్టపరిహారం పెంచాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో 'పురం' విద్యార్థుల ప్రతిభ

కరాటే పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులతో మాస్టర్ ఫైరోజ్

ప్రజాశక్తి-హిందూపురం

ఇటీవల కర్నూలు నగరంలో జరిగిన 11వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హిందూపురం విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు మాస్టర్లు ఫైరోజ్ అహ్మద్, ఉసామాఖాన్ తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలులో జరిగిన కరాటే పోటీల్లో హిందూపురం నుంచి ఆర్.ముబారక్, ఎస్ఎండి జైద్, ఎస్ఎండి సాకిబ్, సి.ధనుష్‌కుమార్, సి.కిశోర్‌కుమార్, జాన్ విక్టర్, ఎస్ఎండి సాజిద్, బి.తేజస్, ఎస్.యాసిన్‌తాజ్, డి.శైలజ, టి.నేహ, టి.స్నేహిత పాల్గొన్నారు. కటా క్యాటగిరీలో ఒకరు ప్రథమ స్థానం, ఐదుగురు ద్వితీయ స్థానంలో, ఆరుగురు తృతీయ స్థానాలు సాధించారు. ఫైట్‌లో ఒకరు ప్రథమ స్థానం, ముగ్గురు ద్వితీయ స్థానంలో, ఏడుగురు తృతీయ స్థానాలు సాధించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నిర్వాహకులు మెమెంటో, ప్రశంసాపత్రాలు అందించారన్నారు.

కార్మికులకు న్యాయం జరిగే వరకూ ఆందోళనలు

తూముకుంట కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి-హిందూపురం

తూముకుంట పారిశ్రామికవాడలోని గురునానక్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు న్యాయం జరిగేంత వరకూ ఆందోళనలు ఆపబోమని తూమకుంట కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్ స్పష్టం చేశారు. న్యాయం కోసం పరిశ్రమ ముందు సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం ఇవ్వకపోగా మూడేళ్లుగా ఇంక్రిమెంట్ కూడా ఇవ్వలేదన్నారు. వేతనాల నుంచి కట్ చేసిన ఈఎస్ఐ, పిఎఫ్‌లను సైతం చెల్లించలేదన్నారు. దీంతో కార్మికులు ఇంక్రిమెంట్ ఇవ్వాలని అడగడంతో యాజమాన్యం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఉన్నఫళంగా పరిశ్రమను మూసివేసిందన్నారు. దీంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. నిబంధనల మేరకు కార్మిక శాఖకు, కార్మికులకు ముందొస్తు నోటీసులు ఇవ్వడంతో పాటు పదేళ్లు పని చేసిన కార్మికులందరికీ చట్టప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించేంత వరకూ న్యాయ పోరాటం చేస్తామన్నారు. కార్మిక శాఖ అధికారులు వెంటనే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పి.బాబు, కార్మికులు రవిశంకర్, చాంద్‌బాషా, శ్రీనివాసులు, చంద్ర, సతీష్, రమేష్, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు

శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తున్న ఓబులు, కార్మికులు

డిఆర్ఒకు సమస్య వివరిస్తున్న జి. ఓబులు

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సత్య సాయి జిల్లాలోని మడకశిర హిందూపురం డివిజన్లలో ఉన్న శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, తాగునీటి వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షులు జి. ఓబులు డిమాండ్ చేశారు. ఆ రెండు డివిజన్ల కార్మికులతో కలసి ఆయన కలెక్టరేట్ ముందు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిఆర్ఒకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు డివిజన్లలో దాదాపు ఎనిమిది లక్షల మంది ప్రజలకు తాగునీరు అందిస్తున్న కార్మికులకు వేతనాలలో కోత విధిస్తూ సక్రమంగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. 180 మంది కార్మికులు 543 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారన్నారు. అయితే అక్కడి కాంట్రాక్టర్ గోవర్ధన్ రెడ్డి, ఎల్‌కె. నాయుడు కార్మికుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. హిందూపురం, మడకశిర డివిజన్లలో కార్మికుల వేతనంలో రూ.3500 కోత విధిస్తున్నారన్నారు. 15 నెలల నుంచి రావలసిన పిఎఫ్ లో 2500 రూపాయలు కోత విధిస్తున్నారన్నారు. ఇదేమిటని ప్రశ్నించినందుకు కార్మికుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తెచ్చిన ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ కోత పెట్టిన వేతనాలలో వచ్చిన ఆదాయాన్ని ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ప్రజా ప్రతినిధులు బినామీ పేర్లతో డ్రా చేసుకుని ఆ డబ్బులు పంచుకుంటున్నారని విమర్శించారు. గత 19 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకుండా కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. సమ్మె ఫలితంగా పలు గ్రామాలలో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. స్థానిక అధికారులు తగు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ విషయంపై గ్రామీణ నీటి సరఫరా పథకం ఎస్ఇ రషీద్ ఖాన్ ను ప్రశ్నించగా తాను ఏమి చేయలేనని తనకు అధికారాలు లేవని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. సమ్మె చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.కార్మికుల సమస్యలపై ఇక్కడి కలెక్టర్ న్యాయం చేస్తారన్న నమ్మకంతో ఇక్కడికి ఈ రెండు డివిజన్ల కార్మికులు వచ్చామని కలెక్టర్ స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు సుబ్బరాజు, కార్యదర్శి హనుమంతు, ఉపాధ్యక్షులు సోమశేఖర్, సంయుక్త కార్యదర్శి మురళి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పింఛన్లు అందజేస్తున్న నాయకులు

నూతన పింఛన్లు పంపిణీ

కదిరి టౌన్ : నూతనంగా మంజూరైన సామాజిక పింఛన్లను వైసిఇప పట్టణ అధ్యక్షులు బహువుద్దిన్ పంపిణీ చేశారు. పట్టణంలోని 10 వ వార్డు సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు వార్డు కౌన్సిలర్ కె ఎస్ దిల్షాదున్నిసా, వైసిపి కదిరి పట్టణ అధ్యక్షులు కె ఎస్ బహవుద్దీన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వెల్ఫేర్ సెక్రటరీ కృష్ణ మూర్తి, విఆర్ఒ బాబ్జాన్, ఎడ్యుకేషన్ సెక్రెటరీ కార్తిక్, ప్లానింగ్ సెక్రెటరీ లోకేష్, ఇతర సిబ్బంది, వాలంటీర్లు, స్థానిక నాయకులు షనవాజ్,సాదీ అన్వర్, మస్తాన్ ఖాన్, మౌలా, రహంతుల్లా, గఫార్, ఖితాబ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన

గాండ్లపెంట : మండల పరిధిలోని ముండగలవారిపల్లిలో మూడు రోజులుగా చెన్నకేశవ ఆలయం ప్రారంభోత్సవాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పో రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచి హుస్సేన్ పీరా, రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో ఉలవలు పంపిణీ

నల్లచెరువు : నల్లచెరువు సచివాలయం 2, లో సోమవారం మండల వ్యవసాయ అధికారి భారతి ఆధ్వర్యంలో రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ రమణారెడ్డి మాట్లాడుతూ ఉలవలు అవసరమైన రైతులు తమ ఆర్‌బికెల వద్ద 80 శాతం సబ్సిడీతో అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పంచరత్నమ్మ, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : వైస్ ఎంపీపీ కేశవరెడ్డి మరియు మండల అగ్రి అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌పి కుంట రైతు భరోసా కేంద్రంలో అర్హులైన రైతులకు సబ్సిడీతో ఉలవలు సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అంజనమ్మ, ఉప సర్పంచి ఈశ్వర్‌రెడ్డి , ఎంపీటీసీ తిమ్మారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, HINDUPURAM
I.A.No.236/2023 in O.S.No.92/2014

Between:
1.R. Siva Reddy (Died) by his Lrs Plaintiffs No-3 and 4
2.R.Bhaskar Reddy, 3. Smt. R. Sarojamma
4.R.Bayapa Reddy ...**Petitioners/ Plaintiffs**
AND
1.Gangulamma and others
...**Respondents/ Defendants**

NOTICE TO RESPONDENTS/ DEFENDNATS NO-19 TO 25, 27, 29, AND 30

1.Smt. Nagamanamma W/o Sadasiva Reddy, aged about 35 years, House wife, R/o. Adinarayanahalli, H/o. Hamsandra, Gudibanda Taluk, Chikkabalapur Dist. **(D19)**
2.Sarojamma W/o. Asi Reddy, aged about 34 years, House wife, R/o. Adinarayanahalli, H/o. Hamsandra, Gudibanda Taluk, Chikkabalapur Dist. **(D20)**
3.Syamalamma W/o. Narasimha Reddy, aged about 32 years, House wife, R/o. Gundlakothuru Village, Yellodu Mandal, Gowribidnaur Taluk, Chikkabalapur Dist. **(D21)**
4.Ram Mohna Reddy, S/o. R. Narasimha Reddy, aged about 35 Years, Teacher, Palagala Palli Village, Chilamathur Mandal. **(D22)**
5.Smt. Kanthamma W/o. Sivarami Reddy, aged about 45 years, House wife, R/o. Palagala Palli Village, Chilamathur Mandal. **(D23)**
6.Pallavi W/o. Narasimha Reddy, aged about 31 years, House wife, R/o. Chinnanna Palli, H/o. Lalepalli, Chilamathur Mandal. **(D24)**
7.Prveen Kumar Reddy S/o. Sivarami Reddy, aged about 26 years, Employee, Palagala Palli Village, Chilamathur Mandal. **(D25)**
8. Sankar Reddy 5/o. Rami Reddy, aged about 58 years, Cultivation, Palagala Palli, Chilamathur Mandal. **(D27)**
9.Parvathamma, W/o. Gopal Reddy, aged about 49 years, Cultivation, R/o. Madireddy Palli, H/o. Morasala Palli, Chilamathur Mandal. **(D29)**
10.Santhamma W/o. Nagabhushana Reddy, aged about 42 years, House wife, R/o. Gorantla, Gorantla Mandal. **(D30)**

The plaintiffs filed the above suit for partition of the suit schedule properties against you respondents/defendants No-19 to 25,27,29 and 30 and others on the file art the Senior Civil Judge Court, Hindupuram and also filed I.A. 236/2023 adding of the praposed defendants No-19 to 30 and it is posted to 21-09-2023 for your appearance in person or through an advocate. If you failed to appear on that day, you will be set-exparte and the matter will be decided in your absence.

(By the order of court)
C.RAMACHANDRA REDDY
ADVOCATE FOR THE PLAINTIFFS
HINDUPURAM

రైతులకు 24 గంటలు విద్యుత్ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి బత్తలపల్లి

రైతు ప్రభుత్వమని రైతులకు నాణ్యమైన కరెంటు ఇచ్చి ఆదుకుంటామంటూ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతాంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని టిడిపి నాయకులు విమర్శించారు. ఈ మేరకు టిడిపి నాయకులు ఆపార్టీ మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి సబ్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి జాతీయ రహదారిపై బైటాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆగస్టు నెలలో రైతులు వరి నాట్లు వేయాల్సి ఉండగా కరెంటు కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతులకు 24 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎఇకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేంద్ర నాయుడు, నెట్టెం రమణ, బోయపాటి అప్ప స్వామి నాయుడు, చల్లా శ్రీనివాసులు, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో పాల్గొన్న టిడిపి నాయకులు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కరువు మండలంగా ప్రకటించాలి

తనకల్లు : తనకల్లు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఎం, ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్థానిక తహశీల్దార్ శోభాసువర్ణమ్మకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వేసిన పంటలు వర్షాభావం వలన పూర్తిగా ఎండిపోయాయన్నారు. ప్రస్తుతం కురుస్తున్న అరకొర వర్షాలకు ప్రత్యామ్నాయ పంటలు వేయడానికి విత్తనాలు సరఫరా చేయడంలో వ్యవసాయశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు.కరువు మండలంగా ప్రకటించి రుణాలన్నీ మాఫీ చేయాలని, నాణ్యమైన విద్యుత్ ను కోతలు లేకుండా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులుశివన్న, వివి. రమణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పర్యవేక్షణ లోపంపై జూనియర్ సివిల్ జడ్జి ఆగ్రహం

మున్సిపల్ అధికారులకు హెచ్చరిక

కార్యాలయం పరిసరాల్లో నెలకొన్న అపరిశుభ్రతను చూస్తున్న జడ్జి, న్యాయవాదులు, అధికారులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పర్యవేక్షణ లోపం పై జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పుట్టపర్తి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పరిసర ప్రాంతాల్లో చెత్త దిబ్బలు పేరుకుపోయి దోమలు ప్రబలి దుర్గంధం వెదజల్లుతోందని వాటిని శుభ్రం చేయాలని స్థానిక మునిసిపల్ పారిశుధ్య పర్యవేక్షణ అధికారికి కోర్టుకానిస్టేబుల్ ద్వారాను, మౌఖికంగాను పలు పర్యాయాలు సమాచారం చేరవేశారు. అయితే శానిటరీ ఇన్స్‌పెక్టర్ సోమశేఖర్ క్రింది స్థాయి సిబ్బందికి సూచనలు చేయకుండా పారిశుధ్య నివారణపై నిర్లక్ష్యం వహించారు. ఈ విషయంపై జడ్జి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా స్పందన కరువైంది. దీంతో జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ శానిటరీ అధికారికి కబురు పంపి వెంటనే తన ముందు హాజరు కావాలని ఆదేశించారు. జడ్జి పరిసరాలు అపరిశుభ్రంగా వున్నా ఎందుకు చర్యలు లోపించాయని ప్రశ్నించారు. అయితే శానిటరీ ఇన్స్‌పెక్టర్ పారిశుధ్య లోపాలను జడ్జి తెలియజెప్పారు. దీంతో జడ్జి మునిసిపల్ కమిషనర్‌ను హాజరు కావాలని ఆదేశించారు. ఇన్‌ఛార్జి కమిషనర్ స్వాతి హాజరుకాగానే జడ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాల పారిశుధ్య లోపంపై న్యాయవాదులను సమక్షం లో కోర్టు చుట్టూ, ప్రత్యేక అవసరాల చిన్న పిల్లల పాఠశాల చుట్టూ నెలకొన్న చెత్తదిబ్బలు, దోమల విజృంభణను చూపెట్టారు. తమకున్న జ్యూడిషియల్ అధికారాలతో న్యాయసేవాధికార సంస్థల ద్వారా పారిశుధ్య లోపం పై ప్రజా ఫిర్యాదులను స్వీకరించి వాటిని ప్రజాప్రయోజన వ్యాజ్యాలు కింద పరిగణించి విచారణ జరిపితే ఎలాంటి చర్యలు ఉంటాయో తెలిసివస్తుందని హెచ్చరించారు. రోజువారి దినచర్యలను పారిశుధ్య అధికారి విధులను ఈ సందర్భంగా జడ్జి గుర్తుచేశారు. క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు కూడా తెలుసు అని సమన్వయం తో సర్దుకుపోతున్నామని జడ్జి తెలియజెప్పారు. దీంతో శానిటరీ ఇన్స్‌పెక్టర్ స్పందించి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. ప్రతి శనివారం ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రం చేయిస్తామని శానిటరీ ఇన్స్‌పెక్టర్ వివరించారు. సుమారు గంట పాటు కార్యాలయాల పరిసరాలలో జడ్జి కలయతిరిగారు. ఇటీవల పారిశుధ్య లోపం పైనా విషజ్వరాల బారిన పడుతున్న ప్రజల అవస్థలు ప్రతి రోజు పత్రికలలో గమనిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు నిడిమామిడి శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్ రెడ్డి, లెక్కల యదుభూషన్, చల్లా శేఖర్ నాగేంద్ర, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు చేయూత

ప్రజాశక్తి - పరిగి

ఇటీవల జరిగిన రెజ్లింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని గ్రామీణ ప్రాంతాల నుండి 8 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారు. ఈ విద్యార్థులు నిరుపేద కుటుంబం నుండి వచ్చి క్రీడల్లో మంచి ప్రతిభ కనబరచడంతో వారిని ప్రోత్సహించేందుకు పరిగి వేణుగోపాలరావు ముందుకు వచ్చారు. వీరికి అవసరమైన క్రీడా సామాగ్రి, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు వెళ్లేందుకు రవాణా ఖర్చు ఇతరత్రా ఖర్చుల నిమిత్తం ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ అందించేందుకు ముందుకు వచ్చారు ఈ మేరకు కోచ్ రమేష్ ద్వారా విద్యార్థులను కార్యాలయానికి సోమవారం పిలిపించి వారికి రూ. 12 వేల విలువైన చెక్కును అందించారు.

చెక్కు అందజేస్తున్న వేణుగోపాలరావు

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

ప్రజాశక్తి బుక్కపట్నం

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం కదిరి మండల పరిధిలోని ఎర్రదొడ్డి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండల పరిధిలోని మధురై బయలుతండాకు చెందిన వారి కుటుంబాలను ఆయన సోమవారం పరామర్శించారు. చిన్నస్వామి నాయక్, చలపతి నాయక్, భాస్కర్ నాయక్, మధిర బైలుకు చెందిన శ్రీలేఖ మృతదేహాల వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకే గ్రామంలో ముగ్గురు మృతిచెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చి తక్షణ సహాయం కింద ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బాధితులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం

పుట్టపర్తి క్రైమ్ : రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లోని ఎంబీబీస్ సీట్లు అమ్మకానికి పెట్టడం వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని టిడిపి నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన మెడికల్ కాలేజుల్లోని మెడికల్ సీట్లను అమ్మకానికి పెడుతూ తీసుకున్న నిర్ణయం అత్యంత దుర్మార్గమైనదన్నారు. కన్వీనర్ కోటాలో 50 శాతం సీట్లు,35 శాతం సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానంలో ఎన్ఆర్ఐ కోటాలో మిగిలిన 15 శాతం సీట్లు భర్తీ చేసేందుకు సిద్ధపడటం బాధాకరమన్నారు. ఈ నిర్ణయంతో నష్టపోయేది బడుగుబలహీన వర్గాలేనని అన్నారు.

అరగుండుతో ఊరేగింపు

భర్త వివాహేతర సంబంధంపై భార్య, బంధువుల ఆగ్రహం

ప్రజాశక్తి-హిందూపురం

భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ తనకు అన్యాయం చేయడంతో భార్య భర్త, అతడి ప్రియురాలికీ అరగుండు కొట్టించి ఊరేగించిన సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు.. పరిగి మండల పరిధిలోని ఊటకూరుకు చెందిన హుస్సేన్‌కు స్థానిక రహమత్‌పురంలో నివాసం ఉంటున్న నజియాతో వివాహం జరిగింది. వారు రహమత్‌పురంలోనే నివాసం ఉంటున్నారు. హుస్సేన్ ఓ మహిళతో వివాహే తర సంబందం పెట్టుకుని తరచూ భార్యతో గొడవలు పడేవాడు. వీరి విషయంలో పలుమార్లు పెద్దలు కలుగజేసుకుని సర్ది చెప్పారు. ఓ పండుగ సమయంలో ఇంట్లో చేసిన బిర్యానీని ప్రియురాలికి తీసుకెళ్లి ఇచ్చాడని వారు గొడవ పడ్డారు. ఇలా ప్రతి విషయంలో దంపతుల మధ్య గొడవలు జరిగేవి. ఈ గొడవలు కేవలం వివాహేతర సంబంధం వల్లే జరుగుతున్నట్లు గ్రహించిన భార్య, ఆమె బంధువులు సోమవారం కాపుకాచి హుస్సేన్‌తో పాటు అతడు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న మహిళను పట్టుకున్నారు. ఇద్దరికీ అరగుండు కొట్టించి, వారి మెడలో చెప్పుల హారం వేసి, చేతికి తాడు కట్టి పట్టణంలో ఊరేగించారు. అనంతరం తనకు జరిగిన అన్యాయంపై పరిగి పోలీస్ స్టేషన్‌లో నజియా ఫిర్యాదు చేసింది.

నేరాలు ఘోరాలు

పేకాట జూదరులు అరెస్టు

నల్లచెరువు మండల పరిధిలోని దేవిరెడ్డిపల్లి గ్రామ శివారులలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వరలక్ష్మి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద ఉన్న రూ.13,500ల నగదు, 3 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు చెప్పారు.

యువకుడు ఆత్మహత్య

కొత్తచెరువు : మండల కేంద్రానికి చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక బీసీ కాలనీకి చెందిన పవన్ (21)కు మూడు నెలల క్రితం వివాహం అయింది. ఈ నేపథ్యంలో కుటుంబ కలహాలతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే పవన్ మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

పోలా రామాంజినేయులు మృతి తీరని లోటు

కొత్తచెరువు : చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు మృతి పార్టీకి తీరని లోటు అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, పుట్టపర్తి డివిజన్ నాయకులు అంజి, గంగాధర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలారామాంజినేయులు చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తుది శ్వాస విడిచే వరకు పోరాటాలు నిర్వహించారన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు

జిల్లాలో 478.4 మిల్లీమీటర్ల వర్షపాతం

పుట్టపర్తి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి 478.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు గణాంకాల అధికారి గంగాధర్ తెలిపారు. అత్యధికంగా ధర్మవరం లో 82.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందన్నారు. జిల్లాలో 8 మండలాలు మినహా మిగతా అన్ని మండలాలలో ఒక మోస్తారు వర్షాలు కురిసాయన్నారు. పెనుకొండలో 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందన్నారు. అయితే ఈ వర్షాల వల్ల ఎండిపోయిన వేరుశనగ పంటకు ఎలాంటి ఉపయోగం లేదని రైతులు తెలిపారు. ఈ వర్షాలకు అక్కడక్కడ కుంటలలో చెరువులలో నీరు చేరింది.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

పుట్టపర్తి రూరల్: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో జిల్లా నుండి వచ్చిన పలువురు ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుండి 43 పిటీషన్లు స్వీకరించారు. వారి సమస్యను అడిగి తెలుసుకొని, సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందన లో ఎక్కువగా రస్తావివాదాలు, కుటుంబ కలహాలు, అదనపు కట్నం కోసం భర్త/అత్తారింటి వేధింపులు, ఉద్యోగ మోసాలు, భూవివాదాలు, ఆర్థికమోసాలు, సైబర్ నేరాలు, సంబంధిత సమస్యలతో ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. పోలీసుల పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి'

కొత్తచెరువు : టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ తెలిపారు. కొత్తచెరువులోని గాంధీనగర్‌లో సోమవారం నిర్వహించిన భవిష్యత్తు గ్యారెంటీ అనే కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి తిరిగి మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బండ్లపల్లి రాజు, సురేష్, సుబ్బరాయుడు, ఆంజనేయులు, శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాగులకట్ట నిర్మాణానికి సాయం

తనకల్లు : మండల పరిధిలోని తిరుమలయ్య గారి పల్లిలో చేపట్టనున్న నాగులకట్ట నిర్మాణానికి ప్రముఖ పారిశ్రామిక వేత్త ఎంజీ రెడ్డి రూ. 40 వేలు విరాళం అందజేశారు.గ్రామం లో పురాతన నాగలకట్ట మరమ్మతు పనులు చేపట్టాలని పలువురు గ్రామస్తులు ఎంజీ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన గ్రామానికి వచ్చి ఆర్థిక సాయాన్ని అందించారు. ఎంజీ రెడ్డి కి ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు చంద్రారెడ్డి, రెడ్డెప్ప, చంద్ర, వినోద్ కుమార్, సమర సింహ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు కదిరికి బస్సుయాత్ర

కదిరి టౌన్ : .రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ తలపెట్టిన బస్ యాత్రను జయప్రదం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం. వేమయ్య యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో వేమయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్టు 17 నుండి సెప్టెంబర్ 8 వరకు బస్సుయాత్రను చేపడుతున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 5న సాయంత్రం నాలుగు గంటలకు కదిరిలో అంబేద్కర్ సర్కిల్లో జరిగే బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రసంగించనున్నారని చెప్పారు..

రత్నాకర్‌కు పలువురి శుభాకాంక్షలు

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఆర్ జే రత్నాకర్ 53వ జన్మ దినాన్ని పెడపల్లి గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన డాక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో మారెమ్మ గుడి ఆవరణంలో 53 కేజీల కేక్‌ను రత్నాకర్ చేతుల మీదుగా కోసి పంచిపెట్టారు. ఈసందర్భంగా రత్నాకర్‌ను పెడపల్లి గ్రామస్తులు గజమాలతో సత్కరించారు. డాక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదయ కిరణ్ ఇంగ్లీష్ మీడియం కరస్పాండెంట్ సుబ్రమణ్యం ప్రధానోపాధ్యాయులు హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు. పెడపల్లి మారమ్మ దేవాలయంలోసత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో సత్యసాయి భక్తులు ప్రజలు పెద్ద సంఖ్యలో భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండమ రాజు, రాజారెడ్డి ,లాయర్ హరికష్ణ నారాయణ, రాఘవేంద్ర, మాజీ సర్పంచి శ్రీరాం నాయక్, భాస్కర్ రెడ్డి, ప్రకాష్ నాయుడు, డాక్టర్ విక్రమ్, బుక్కపట్నం చెన్నప్ప, శివానాయక్, అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

పుట్టపర్తి క్రైమ్ : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బుక్కపట్నం మండలానికి మృతుల కుటుంబాలను ఆదుకోవాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు కాలే నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బుక్కపట్నం మండటానికి చెందిన నలుగురు మృతిచెందారన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో కదిరి విద్యార్థుల సత్తా

కదిరి టౌన్ : కర్నూల్ లో ఈనెల 3న ఆర్గనైజర్ జగదీష్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో కదిరికి చెందిన మాస్టర్ షేక్షా ఆధ్వర్యంలో పాల్గొన్న కదిరి విద్యార్థులు తమ సత్తా చాటారు.ఉమెన్స్ ఓపెన్ కుమితే గ్రాండ్ ఛాంపియన్‌షిప్‌లో కదిరికి చెందిన సబాఖానం మొదటి, కదిరి బ్లూ మూన్ జూనియర్ కాలేజీకి చెందిన సిరి ద్వితీయ స్థానాన్నికైవసం చేసుకున్నారు. బ్లూ మూన్ కాలేజీ విద్యార్థినిలు కుమిత్ విభాగంలో నికిత, గోల్డ్ మెడల్ సాధించింది, కట విభాగంలో సిరి గోల్డ్ మెడల్ , నికిత బ్రాంచ్ మెడల్ సాధించారు. అదేవిధంగా బ్లూ మూన్ స్కూల్ విద్యార్థులు కటా విభాగంలో చందన శ్రీ, షరణి మొదటి, ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు.మూడో స్థానాన్ని సాత్విక్, రాహుల్ కైవసం చేసుకున్నారు. సెయింట్ థామస్ స్కూల్ విద్యార్థులు కట, కుమిత్ ఫైట్ విభాగంలో డింపు శ్రీ, ప్రగ్నేష్, వర్షిత బాయ్, గోల్డ్ సిల్వర్ మెడల్స్ సాధించారు. ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినిలు నాగ వర్షిత, వర్షిత, కట కుమిత్ ఫైట్ విభాగంలో గోల్డ్ సిల్వర్ మెడల్ సాధించారు.ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థి నూర్ మొహమ్మద్ కుమ్మితే విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సీనియర్ కరాటే మాస్టర్లతో పాటు స్కూల్ యాజమాన్యం అభినందించారు